సాక్షి నంద్యాల

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద పథకానికి ఆదోనికి చెందిన జి.రాజేష్‌రెడ్డి దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళాన్ని అందించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై సోమవారం హైదరాబాద్‌కు చెందిన లాస్య నర్తనం అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

7న మిషన్ వాత్సల్య పరీక్ష

నంద్యాల(అర్బన్): జిల్లా బాలల సంరక్షణ విభాగం (మిషన్ వాత్సల్య)లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఆర్‌జీఎం కళాశాలలో ఈనెల 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి నిర్మల సోమవారం తెలిపారు. ఉదయం 11.30 నుంచి 1 గంట వరకు డీసీపీఓ, పీఓ(ఐసీ), పీఓ(ఎన్ఐసీ), ఎన్‌సీపీఓ, కౌన్సిలర్, సోషల్ వర్కర్స్ (ఐసీపీఎస్) (ఎస్ఏఏ), ఎస్ఏఏ మేనేజర్‌లకు మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు అకౌంటెంట్, డేటా అనాలసిస్ట్ డీఈఓ (సీడబ్ల్యూసీ), డీఈఓ (ఐసీపీఎస్), డీఈఓ (జేజేడబ్ల్యూ)లకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఔట్ రీచ్ వర్కర్, ఏఏన్ఎం, ఆయా, చౌకీదార్ అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాకు 3వ స్థానం



నూనెపల్లెలో దివ్యాంగురాలు తన్వికకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చెరుకు శ్రీదేవి

నంద్యాల(న్యూటౌన్): ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీలో రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లా మూడవ స్థానంలో నిలిచినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ సోమవారం పూర్తయిందని, 99.20 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. జిల్లాలో 2,24,398 ఉండగా 2,22,607 మందికి అందజేశామన్నారు.

డీసీసీబీ సీఈఓ రాజీనామా

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు తన పదవికి రాజీనామా చేశారు. కొద్ది రోజుల క్రితం జరిగిన బోర్డు సమావేశంలో ఆయన తన వ్యక్తిగత కారణాలతో సీఈఓ పదవికి రాజీనామా చేస్తూ ఇందుకు సంబంధించిన పత్రాలను చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో పాటు పాలకమండలి సభ్యులకు సమర్పించారు. ఆ మేరకు రాజీనామాను పాలకవర్గం ఆమోదించింది. సీఈఓగా పి.రామాంజనేయులు దాదాపు తొమ్మిదేళ్ల పాటు సేవలు అందించారు. తాత్కాలిక సీఈఓగా జనరల్ మేనేజర్, నంద్యాల జిల్లా రీజినల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శివలీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జి సీఈఓగా శివలీల బుధవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. రాజీనామా చేసిన పి.రామాంజనేయులు ఇక్కడే జనరల్ మేనేజర్‌గా కొనసాగనున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాల్లో మొదటి రోజున పరీక్షలు నిర్వహించారు. ఉదయం స్పెల్‌లో 1,015 మందికిగాను 951 మంది, మధ్యాహ్నం స్పెల్‌లో 767 మందికిగాను 740 మంది హాజరయ్యారు.


శ్రీశైలంకు మరో మరబోటు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) శ్రీశైలంలో పర్యాటకుల సౌకర్యార్థం మరో బోటును అందుబాటులోకి తీసుకొచ్చింది. పాతాళ గంగ నుంచి అక్క మహాదేవి గుహలు, శ్రీశైలం డ్యాం సైట్ సీయింగ్‌కు ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఇప్పటికే శబరి 40, మధుమతి 30, భ్రమరాంబ 20, పల్నాడు 32 సీట్ల మర బోట్లు ఉన్నాయి. ఇందుకు ఒక్కొక్కరికి రూ.650 టికెట్ ఉంది. ఇందులో రూ.500 ఏపీటీడీసీకి రూ.150 తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెల్లిస్తున్నారు. డ్యాం సైట్ సీయింగ్‌కు ఒక్కొక్కరికి రూ.80 టికెట్ ధర చెల్లించాలి. సైట్ సీయింగ్‌కు 30 నిమిషాలు పడుతుంది. ఈ నాలుగు బోట్ల నుంచి రోజుకు రూ.60 వేల వరకు సమకూరుతోంది. పర్యాటకుల రద్దీ దృష్ట్యా 50 సీట్లు ఉన్న మరో నూతన మరబోట్ నందినిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ బోటును ఇటీవల ప్రారంభించామని ఏపీటీడీసీ కర్నూలు డివిజనల్ మేనేజర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ బోట్‌తో రోజుకు అదనంగా రూ.20 వేల ఆదాయం వస్తుందన్నారు.



అందుబాటులోకి వచ్చిన నూతన మరబోటు

మహాభివృద్ధి



మహానంది ఆలయ ఏరియల్ వ్యూ



మహానందీశ్వర గర్భాలయ ఆలయ ద్వారానికి వెండి ఫలకాలు అమర్చిన దృశ్యం

- పురోగాభివృద్ధి దిశగా మహానంది క్షేత్రం
- రూ. 30 కోట్లతో వలు పనులు ప్రారంభం
- రూ. 80 లక్షలతో కోనేరుల మరమ్మతులు
- రెండేళ్లలో మూడింతలు పెరిగిన హుండీ కానుకల ఆదాయం

మహానంది: రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానంది దేవస్థానంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత పాలకుల నిర్లక్ష్యంతో క్షేత్రం అభివృద్ధికి దూరమై సౌకర్యాలు లేక భక్తులు అవస్థలు పడ్డారు. గతంలో ఇక్కడ కొందరు అధికారులు నిర్లక్ష్యంతో పర్యవేక్షణ విస్మరించడం, మరి కొందరు అక్రమాలకు పాల్పడుతూ దేవస్థానం అభివృద్ధికి అగాధం సృష్టించారు. ఉద్యోగుల భర్తీ నుంచి బదిలీల వరకు అన్నీ రాజకీయాలు చేసి దేవస్థానానికి మచ్చ తెచ్చారు. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం ఏర్పడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మహానంది క్షేత్రం రూపురేఖలు మారిపోయాయి. ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మహానంది అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ధర్మకర్తల సమన్వయంతో మహానందీశ్వరుడికి అభివృద్ధి అభిషేకం చేస్తున్నారు. మహానంది దేవస్థానంలో గతంలో అభివృద్ధి పనులు చేయాలంటే నిధుల కొరత ఉండేది. గతంలో ఆలయ బ్యాంకు ఖాతాల్లో కేవలం రూ. 65 లక్షలు మాత్రమే ఉండగా నేడు రూ. 10.50 కోట్లకు చేరడం విశేషం. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కృషితో టీటీడీ ఆధ్వర్యంలో రూ. 4.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వసతి గృహాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. అలాగే మహానంది దేవస్థానానికి చెందిన రూ. 10.50 కోట్లతో 50 వసతి గృహాల నిర్మాణానికి అనుమతులు రావడం, టెండర్లు పూర్తవడం జరిగింది. త్వరలోనే నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి. పురాతనమైన కోనేరుల ఆధునికీకరణకు దేవస్థానం రూ. 40 లక్షలు సమకూర్చగా దేవదాయశాఖ మరో రూ. 40 లక్షలు కలిపి రూ. 80 లక్షలతో పనులు మొదలయ్యాయి. నంది సర్కిల్, కరివేన సత్రం, గాజులపల్లె వైపు రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. అందులో భాగంగానే రూ. 50 లక్షలతో ఆలయ పరిధిలో సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీ పనులు ప్రారంభించారు. మరో రూ. 3 కోట్లతో ఇప్పటికే ఆలయ పరిధిలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు.



దేవస్థానం ఎదురుగా ఆకట్టుకుంటున్న నంది విగ్రహం



నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్స్ కాంప్లెక్స్

ఎమ్మెల్యే శిల్పా ప్రత్యేక చొరవ

మహానంది అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన సొంత నిధులు రూ. 3 కోట్లు వెచ్చించి ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేయిస్తున్నారు. మహానందికి వచ్చిన ప్రతి సారి దగ్గరుండి పనులు పరిశీలిస్తూ నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా చేయిస్తున్నారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు రెండ్రోజులు ఇక్కడే ఉందాం అనుకునేలా ఆలయ పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగానే ఆలయం చుట్టూ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్, భక్తులు కూర్చునేందుకు రాతి, సిమెంటుతో సహజంగా ఉండేలా ఆకృతులను నిర్మిస్తున్నారు. రాతి నంది విగ్రహం చుట్టూ ఇప్పటికే వాటర్ ఫౌంటేయిన్, అధునాతనమైన బల్బులు ఏర్పాటు చేయడంతో భక్తులను ఆకర్షిస్తోంది.

ఏటా పెరుగుతున్న ఆదాయం

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల ద్వారా క్షేత్రానికి ఏటా ఆదాయం పెరుగుతోంది. ఓ వైపు ఆర్జిత సేవా టికెట్లు మొదలుకొని దర్శన టికెట్లు, టెండర్లు, ఆలయ భూముల కౌలు వరకు మొత్తం ఏటా గతంలో రూ. 10 కోట్ల లోపు ఉండేది. ప్రస్తుతం ఆ ఆదాయం ఐదేళ్లలో దాదాపు ఏటా రూ. 17 కోట్లకు చేరుకుంది. అలాగే ఆలయంలో అనధికారిక వసూళ్లు లేకుండా చేయడంతో హుండీ కానుకల ఆదాయం గణనీయంగా పెరిగింది. 2020–21లో రూ. 1,26,68,716 ఆదాయం రాగా 2022–23లో రూ. 3,13,36,579 రావడం విశేషం. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఉండేందుకు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆలయంలో 94 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

వెల్లువలా దాతల విరాళాలు

మహానంది అభివృద్ధిలో దాతలు భాగస్వాములవుతున్నారు. వారి ఇచ్చిన విరాళాలతో క్షేత్ర పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే...

- బళ్లారికి చెందిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సహకారంతో శ్రీ మహానందీశ్వరస్వామివారి గర్భాలయ ముఖద్వారానికి రూ. 70 లక్షలతో వెండితొడుగు
- కర్నూలుకు చెందిన కీర్తిశేషులు నాగయ్య సతీమణి జయలక్ష్మమ్మ సహకారంతో రూ. 21 లక్షలతో శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారి గర్భాలయ ముఖద్వారానికి వెండి తొడుగు
- స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద జీఎస్‌డబ్ల్యూ వారి ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం రూ. 40 లక్షలతో టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణం
- స్వామి, అమ్మవారి ప్రధాన గర్భాలయ గోపురాల కు బంగారు కలశాలను 250 గ్రాములతో చేయించేందుకు నవగ్రహాల ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ముందుకొచ్చారు.
- నంద్యాలకు చెందిన హనుమాన్ ట్రేడర్స్ వారు స్వామివారికి రూ. 37 కిలోల వెండితో రుద్రాక్షమండపం చేయించారు.
- పలు ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో రూ. 68లక్షలు వెచ్చించి స్వామి, అమ్మవారి ఆలయాల చుట్టూ ఉన్న పాత ఇనుప కటాంజనాలు తొలగించి వాటి స్థానంలో సుందరంగా ఇత్తడి కటాంజనాయలు చేయిస్తున్నారు.
- కల్యాణకట్ట వద్ద మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు ప్రొద్దుటూరుకు చెందిన సీవీ సుబ్బారావు షెడ్డు ఏర్పాటుకు ముందుకొచ్చారు.
- దాతల విరాళాలతో రాహుకేతు మండపాన్ని నిర్మించి రాహుకేతు దోషనివారణ పూజలు ప్రవేశపెట్టారు.
- దేవస్థానం సిబ్బంది సహకారంతో రూ. 26 లక్షలు వెచ్చించి మినీ కల్యాణమండపం మాఘమాసంలో నిర్మించనున్నారు. నంద్యాల మండలం పొన్నాపురం కాలనీకి చెందిన దాతల సహకారంతో గోవులకు షెడ్డు నిర్మించారు. దీని ద్వారా నెలకు రూ. 2లక్షలు ఆదాయం సమకూరుతుంది.
- క్షేత్రానికి భక్తుల రద్దీ పెరగడంతో అన్నదాన కేంద్రంలో ప్రతి శని, ఆది, సోమవారాల్లో మూడొందల మందికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. 2022లో మహానంది, నంద్యాల మండలాల్లోని రైతులను సంప్రదించి వారి నుంచి 340 బస్తాల బియ్యం, కందిపప్పు సేకరించారు 2023 లోనూ మహానంది మండలంలోని రైతుల నుంచి 500 బస్తాల వరకు బియ్యం సేకరించారు.

మోడల్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతాం



మహానంది ఆలయాన్ని రాష్ట్రంలోనే మోడల్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత పాలకుల హయాంలో క్షేత్రం నిండా అవినీతి పేరుకుపోయింది. ప్రస్తుతం అవినీతిని పూర్తిగా రూపుమాపి అభివృద్ధి దిశగా దూసుకెళ్తుంది. శ్రీశైలం తరహాలో మహానందిని అభివృద్ధి చేస్తున్నాం. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రూ. 3కోట్ల సొంత నిధులతో సుందరీకరణ పనులు చేపట్టాం. దాతల సహకారంతో సాధారణ, ఏసీ, సూట్‌రూములు త్వరలోనే నిర్మించేందుకు నమూనాలతో ప్లాన్‌లను పూర్తి చేశాం. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డితో ఎప్పటికప్పుడు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చిస్తూ సూచనలు ఇస్తున్నాను.

– శిల్పా చక్రపాణిరెడ్డి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే

దాతల సహకారంతో సౌకర్యాల కల్పన



భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాను. ఆలయాభివృద్ధికి దాతలు ఎంతో సహకరిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ. 4కోట్ల వరకు దాతల ద్వారా పనులు చేశాం. మరికొంత మంది దాతల సహకారంతో మరిన్ని పనులకు ప్రణాళికలు రూపొందించాం. సిబ్బందికి అందించాల్సిన అరియర్స్, డీఏ, ఇతర బెనిఫిట్స్ ద్వారా రూ. 70 లక్షలు చెల్లించాం. దేవస్థానంలో పనిచేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులు 65 మందికి ఒక్కొక్కరికి నెలకు రూ. 4,500 వేతనం పెంచేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, కమిషనర్ సహకరించారు. మహానంది ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ఎంతో సహకరిస్తున్నారు.

– కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ, మహానంది

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ

- జిల్లాకు చెందిన రెండు ప్రదర్శనలకు బహుమతులు
- విద్యార్థిని, ఉపాధ్యాయులను అభినందించిన కలెక్టర్, డీఈఓ



బహుమతులు సాధించిన విద్యార్థి, ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, డీఈఓ సుధాకర్

నంద్యాల (న్యూటౌన్): విజయవాడలో ఇటీవల జరిగిన సదరన్ ఇండియా సైన్స్‌ఫేర్ – 2024లో నంద్యాల జిల్లాకు చెందిన రెండు ప్రదర్శనలు బహుమతులు అందుకున్నాయి. డీఈఓ సుధాకర్‌రెడ్డి, సైన్స్ కో ఆర్డినేటర్లు కేవీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో కొత్తపల్లె మండలం దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగాధర్‌రెడ్డి, ఫిజికల్ సైన్స్ కృష్ణమోహన్ ప్రదర్శించిన ఆటోమేటిక్ సోలార్ ట్రాక్టర్ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి లభించింది. అలాగే ఉపాధ్యాయ విభాగంలో బనగానపల్లె ఉపాధ్యాయురాలు షనాజ్ బేగం ప్రదర్శించిన 'ఆటోమేటిక్ హ్యాండ్ శానిటైజర్ డిస్పెన్సర్' ప్రాజెక్టుకు భారత్ ఎలక్ట్రానిక్స్ తరఫున ప్రత్యేక బహుమతి లభించింది. ఆరోగ్య పరిరక్షణలో హ్యాండ్‌వాష్ చాలా కీలకమైన పాత్ర అనేది ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం. యంత్రాన్ని తాకకుండానే చేతిని దగ్గరకు తీసుకొని వెళ్లినప్పుడు శానిటైజర్, లిక్విడ్‌సోప్ పడేటట్లు సెన్సార్ టెక్నాలజీని ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండేటట్లు ఈ ప్రాజెక్టును తయారు చేశారన్నారు. రీచార్జబుల్ బ్యాటరీలు కలిగి ఉండటం సులభంగా రీఫిల్ చేయడం తక్కువ విద్యుత్‌తో పని చేయడం దీని ప్రత్యేకత. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో బహుమతులు అందుకున్న దుద్యాల జెడ్పీ పాఠశాల విద్యార్థి గంగాధర్‌రెడ్డి, ఫిజికల్ సైన్స్ కృష్ణమోహన్, బనగానపల్లె ఉపాధ్యాయురాలు షనాజ్ బేగంను సోమవారం కలెక్టర్ శ్రీనివాసులు, డీఈఓ సుధాకర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కౌశల్ కో–ఆర్డినేటర్ నాగేంద్రకుమార్, సైన్స్ అధికారి సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సమష్టి కృషి

కర్నూలు: రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసుల సమష్టి కృషితో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావ్ అన్నారు. కర్నూలు బి.క్యాంప్‌లోని రేంజ్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడున్న సెంథిల్‌కుమార్‌ను ఏపీ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ చేసి కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న విజయరావ్‌ను కర్నూలు రేంజ్ డీఐజీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఐజీ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డి, సిద్ధార్థకౌశల్, కృష్ణారావు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మేకల మహేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన నాలుగు జిల్లాల పోలీసు అధికారులతో సమావేశమై శాంతిభద్రతలపై సమీక్షించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ విజయరావ్

నేపథ్యం..

- పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన విజయరావ్ 2010 బ్యాచ్ అధికారి. శిక్షణ అనంతరం వరంగల్, సైబరాబాద్, నల్గొండలో విధులు నిర్వహించారు.
- 2013లో అనంతపురం ఆక్టోపస్ గ్రేహౌండ్స్, 2014లో రంపచోడవరం ఏఎస్పీ, 2015లో హైదరాబాద్ సీఐడీ, 2016లో విజయనగరం 5వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు.
- ఎస్పీగా 2017లో గుంటూరు అర్బన్, 2019లో విజయవాడ డిప్యూటీ కమిషనర్, 2020లో విజయవాడ రైల్వే, 2021 నెల్లూరులో పని చేశారు. కాకినాడ 3వ బెటాలియన్ నుంచి కర్నూలు డీఐజీగా బదిలీ అయ్యారు.

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: స్పందన వినతులను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వెంటనే స్పందించి వేగవంత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన సమస్యలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని వినతులను సవివరమైన కారణాలు తెలుపుతూ ఎండార్స్‌మెంట్ ఇచ్చి విశదీకరించాలన్నారు. స్పందన కార్యక్రమానికి 211 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్ని ఆయా శాఖ సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు.

స్పందనలో కొన్ని వినతులు...

- రోడ్డు ప్రమాదంలో కాలు పూర్తిగా కోల్పోయి జీవనోపాధి కష్టంగా ఉందని, మూడు చక్రాల సైకిల్ ఇప్పించి సహాయం చేయాలని నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన అచ్చయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- నందికొట్కూరు పాలిమేర సర్వే నెం. 196లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని 45 సంవత్సరాల నుంచి సాగుచేస్తున్నానని ఆ పొలాన్ని ఆన్‌లైన్ చేయించి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని ఏబీయం పాలెంకు చెందిన మద్దిలేటి అర్జీ అందజేశారు.
- వితంతువు పెన్షన్ మంజూరైనా డబ్బులు రావడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన మహేశ్వరమ్మ వినతి పత్రం అందజేశారు.

జీవితం ఎంతో విలువైంది

- టౌన్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన స్ఫూర్తిదాయక ఉపన్యాసకులు నిక్ ఉజిసిక్



టౌన్‌మోడల్ హైస్కూల్‌లో విద్యార్థినితో మాట్లాడుతున్న నిక్ ఉజిసిక్



ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిక్ ఉజిసిక్ ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

కర్నూలు సిటీ: ప్రతి ఒక్కరికీ సమస్యలు ఉంటాయని, ప్రశాంతంగా ఆలోచిస్తే వాటికి పరిష్కారం దొరుకుతుందని, జీవితం చాలా విలువైందని ప్రపంచ స్ఫూర్తిదాయక ఉపన్యాసకులు నిక్ ఉజిసిచ్ అన్నారు. సోమవారం కర్నూలులో ఆయన పర్యటించారు. ముందుగా నగరంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నిక్ ఉజిసిచ్ జీవిత చరిత్ర 10వ తరగతి ఇంగ్లిషు పుస్తకంలో పాఠ్యాంశంగా చేర్చారు. ప్రపంచంలో అనేక దేశాల్లో చదువుతున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా నిక్ ఉజిసిచ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను చూసిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. గతేడాది గుంటూరులో నిక్ ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించింది. సోమవారం కర్నూలులో ఓ సంస్థ ఆధ్వర్యంలో టౌన్ మోడల్ హైస్కూల్‌కి వెళ్లి విద్యార్థుతో నిక్ ఉజిసిచ్ ముచ్చటించారు. జీవితం చాలా అందమైనదని, దాన్ని మనం ఏవిధంగా మలుచుకుంటామే భవిష్యత్తు కూడా అలానే ఉంటుందని తెలిపారు. పరీక్షల విషయంలో ఏ ఒక్కరు నిరాశ, నిస్పృహలకు గురి కాకూడన్నారు. అనంతరం ఎస్టీబీసీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. జీవితంలో ఏ ఒక్కరినీ తక్కువగా అంచనా వేయకూడదన్నారు. ప్రతి ఒక్కరికీ ఎక్కడో ఒక చోట ఓ అవకాశం అనేది ఎదురు చూస్తూ ఉంటుందన్నారు. అయితే ఆ అవకాశం కోసం శ్రమించాలన్నారు. ప్రపంచంలో అవకాశాలు అనేవి చాలా ఎక్కువగా ఉన్నాయని, ఏ ఒక్కరూ నిరాశ పడకుండా నిత్యం శ్రమిస్తూనే ఉండాలన్నారు. కార్యక్రమంలో సునీల్ రాబర్ట్, పాతూరి జోసెఫ్ తదితరులు ప్రసంగించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదిమూలపు విశాల్, ఇన్‌చార్జ్ డీఈఓ శ్యామూల్ పాల్, వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

‘ధర్మకర్తల మండలి’ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు దేవాలయాలకు ధర్మకర్త మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోగా మద్దూరునగర్‌లోని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేయాలని పేర్కొన్నారు. కర్నూలులోని ఇస్కాల కృష్ణ స్వామి చౌల్ట్రీ, కర్నూలు మండలం మామిదాలపాడు గ్రామంలోని మాధవ ఆంజనేయస్వామి ఆలయం, దిన్నెదేవరపాడు గ్రామంలోని వేముల వెంగన్నగారి ఈశ్వర స్వామి ఆలయం, ఓర్వకల్లు మండలం ఎన్.కొంతలపాడు గ్రామంలోని యాగంటీశ్వర చెన్నకేశవ ఆంజనేయ స్వామి ఆలయం, పత్తికొండ మండలం పులికొండ గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయం, పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామంలోని గిడ్డ ఆంజనేయ స్వామి ఆలయాలకు ధర్మకర్తల మండలి నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఎగ్జిట్ టన్నెల్ తవ్వకాల పరిశీలన



తవ్వకాలను పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద చెన్నై – సూరత్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టిన ఎగ్జిట్ టన్నెల్ తవ్వకాలను సోమవారం పరిశీలించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. టన్నెల్ వద్ద ఎంత పరిమాణం మట్టి తరలించారు, ఎంత పరిమాణం రోడ్డుకు వినియోగించారనే దానిపై ఆరా తీశామన్నారు. సంబంధిత పరిమాణానికి రాయల్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్స్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

లక్ష్యానికి చేరువగా..!

- జిల్లాలో ముమ్మరంగా ఉపాధిహామీ పథకం పనులు
- ఈ ఏడాది 70 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం
- ఇప్పటికే 68.50 లక్షలు దాటిన పనిదినాలు
- కూలీలకు గరిష్ట వేతనం రూ. 272
- గ్రామాల్లో కూలీలకు చేతి నిండా పని
- ఇప్పటికే 8,707 కుటుంబాలకు వంద పనిదినాలు పూర్తి

కోవెలకుంట్ల: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ఊరూరా ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉపాధి పనుల కల్పనలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోపే అధిగమించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.56 లక్షల కుటుంబాల్లోని 2.71 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆయా మండలాల్లో 70 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ. 337 కోట్ల లేబర్ (కూలీల వేతనం, మెటీరియల్ కలిపి)బడ్జెట్ కేటాయించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుంది. జిల్లాలో ఇప్పటి వరకు 68.50 లక్షల పనిదినాలు పూర్తి అయ్యాయి. ప్యాపిలి మండలంలో అత్యధికంగా ఇప్పటి వరకు 5.59 లక్షల పనిదినాలు, బేతంచెర్ల మండలంలో 3.62 లక్షలు, పాములపాడు మండలంలో 3.23 లక్షలు, బనగానపల్లె మండలంలో 3.17 లక్షలు, బండి ఆత్మకూరు మండలంలో 2.83 లక్షలు, శిరువెళ్ల మండలంలో 2.73లక్షలు, కొత్తపల్లె మండలంలో 2.71 లక్షలు, రుద్రవరం మండలంలో 2.70 లక్షలు, గోస్పాడు మండలంలో 2.57 లక్షలు, చాగలమర్రి మండలంలో 2.48 లక్షల పనిదినాలు కలిపించారు. ఆయా మండలాల్లో ఇప్పటి వరకే 97.95 శాతం పనిదినాలు పూర్తి కాగా ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు వచ్చే నెలాఖరు వరకు గడువు ఉండటంతో అంతకంటే ముందే లక్ష్యాన్ని అధిగమించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.



సంజామల మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో క్లస్టర్ల వారీగా కల్పించిన పనిదినాలు

క్లస్టర్	పనిదినాల లక్ష్యం	ఇప్పటి వరకు పూర్తి	వందపనిదినాలు
కోవెలకుంట్ల	16.99 లక్షలు	15.75 లక్షలు	1,831 కుటుంబాలు
ఆత్మకూరు	17.52 లక్షలు	16.55 లక్షలు	2,380
నంద్యాల	18.43 లక్షలు	18.92 లక్షలు	2,188
డోన్	17.05 లక్షలు	17.32 లక్షలు	2,308

కూలీలకు రూ. 242 సగటు వేతనం

ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పొలాలకు రహదారులు, కేసీ, ఎస్సార్బీసీ, కుంటలు, చెరువులు, బావుల్లో పూడికతీత, కొత్తగా పంట కాల్వలు, కొండ ప్రాంతాల్లో నీరు నిల్వ చేరే పనులు, ఉద్యాన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోట, జామ, తదితర పండ్ల తోటల పెంపకం, తదితర 30 నుంచి 40 రకాల పనులు చేస్తున్నారు. రైతుల అవసరాలకనుగుణంగా ఆయా పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో 20 పనులు మాత్రమే చేసేలా యాప్‌లో నిబంధన విధించారు. ఈ పనులు కాకుండా మరో పని ఎంచుకుంటే 20 పనుల్లో ఒక పనిని ఆన్‌లైన్‌లో తొలగించి కొత్తగా ఎంపిక చేసిన పనిని నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉపాధి పథకంలో ఎలాంటి అవకతవకలు, బినామీ మస్టర్లకు తావు లేకుండా హాజరు విధానాన్ని పకడ్బందీ చేశారు. కూలీలకు రోజుకు రూ. 272 గరిష్ట వేతనం కాగా ఆయా మండలాల్లో రోజుకు రూ. 242 సగటు వేతనం అందింది.

వంద పనిదినాల లక్ష్యంపై దృష్టి

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో 4 వేల కుటుంబాలకు మాత్రమే వంద పనిదినాలు కల్పించారు. ఈ ఏడాది ఇప్పటికే 8,707 కుటుంబాలు వంద పనిదాలు పూర్తి చేసుకున్నాయి. జిల్లాలోని బేతంచెర్ల మండలంలో అత్యధికంగా 762 కుటుంబాలు, బనగానపల్లె మండలంలో 502, అవుకు మండలంలో 451, నందికొట్కూరు మండలంలో 431, జూపాడుబంగ్లా మండలంలో 424, ఆళ్లగడ్డ మండలంలో 373, పాములపాడు మండలంలో 344 కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 50 రోజులకు పైగా గడువు ఉండటంతో 65 పనిదినాలు పైబడిన కుటుంబాలు ఎక్కువ రోజులు పనికి వచ్చేలా ఉపాధి సిబ్బంది దృష్టి సారించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నారు. వంద పని దినాల లక్ష్యంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన పనిదినాలను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వంద పని దినాలు అయ్యాయి



మా కుటుంబంలో భార్య, భర్తలం ఇద్దరం ఉపాధి పనులకు వెళుతూ ఈ ఏడాది వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాము. ఎస్సార్బీసీ, కుంటలో పూడిక తీత పనులకు వెళ్లాము. ప్రతి రోజు రూ. 250 వరకు సగటు వేతనం అందజేశారు. ఈ ఏడాదికి పనిదినాలు ముగియడంతో ప్రస్తుతం మేము వ్యవసాయ పనులకు వెళుతున్నాము.

– మేకల రాజు, ఉపాధి కూలీ, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

అడగగానే ఉపాధి పని కల్పించారు



ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా అడిగిన వెంటనే పనులు కల్పించారు. భార్య, భర్తలం ఇద్దరం వ్యవసాయ, ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో వ్యవసాయ పనులు తగ్గాయి. అధికారులు ఉపాధి పనులు కల్పించడంతో రోజుకు రూ. 250 వరకు వేతనం అందింది.

–దానమయ్య,ఉపాధి కూలీ, గుళ్లదూర్తి, కోవెలకుంట్ల మండలం

లక్ష్యాన్ని అధిగమిస్తాం



క్లస్టర్‌లోని రుద్రవరం, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, చాగలమర్రి, సంజామల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 16,99,440 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 15,75,714 పనిదినాలు పూర్తి అయ్యాయి. మార్చి నెలాఖరుకంతా లక్ష్యాన్ని చేరుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నాము. వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా కూలీల సంఖ్యను పెంచి వచ్చే నెలాఖరు నాటికి లక్ష్యాన్ని చేరుకుంటాం.

– సాంబశివరావు, ఉపాధి పథక ఏపీడీ, కోవెలకుంట్ల

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

కృష్ణగిరి: ఇద్దరు విద్యార్థులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని టి.గోకులపాడులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలబాలికలు కృష్ణగిరిలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. వీరు ప్రతి రోజు ఆటోల్లో పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అయితే సోమవారం ఉదయమే ఒక బాలుడు, ఇక బాలిక ఒకే చోట పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి బాగానే ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన రంజిత్‌కుమార్ నాయక్

తుగ్గలి: మండల పరిధిలోని జి.ఎర్రగుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. జొన్నగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గుంతకల్లు మండలం మైనాపురం తండాకు చెందిన రామిరెడ్డినాయక్ గుత్తి మండలం బసినేపల్లితండా ఫిరోజ్‌నాయక్ ఆటోలో రోజూ కూలీలను పనులకు తీసుకెళ్లే వారు. తిరిగి ఆటో ఇచ్చి రమ్మని కొడుకు రంజిత్‌కుమార్‌నాయక్‌ను(20) సోమవారం పంపాడు. జి.ఎర్రగుడి- చెర్వు తండా మధ్యలో ఆటో అదుతప్పి బోల్తా పడడంతో రంజిత్‌కు తీవ్రగాయాల య్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు, రెన్యువల్ విద్యార్థులు వెంటనే దరఖాస్తులను సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మద్యం అక్రమ రవాణా ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- రూ. 1.27 లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, కారు, నిందితులను చూపుతున్న పోలీసులు

డోన్ టౌన్: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో ముఠా వివరాలను వివరించారు. సోమవారం తెల్లవారు జామున పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న విజయ పాల డెయిరీ వద్ద ఏపీ 39 ఎఫ్‌సీ 2268 నంబర్ కారును తనిఖీ చేయగా.. 30 బాక్స్‌ల్లో కర్ణాటకకు చెందిన 2,880 టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న డోన్ పాతపేటకు చెందిన మహబూబ్‌వలి అలియాస్ వలి, తారకరామ నగర్‌కు చెందిన ఈడిగ శ్రీరాజ్, కొండపేటకు చెందిన రవిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరులో మద్యం కొనుగోలు చేసి ఆంధ్రలో విక్రయిస్తున్నట్లు వెలుగు చూసింది. పట్టుబడిన మద్యం అనంతపురం జిల్లా తాడిపత్రిలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నగేష్, ఏఎస్ఐ రామసుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు వెంకట్రామిరెడ్డి, నాగరాజుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

కర్నూలు(సెంట్రల్): నులిపురుగుల నివారణతో చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బాల బాలికలు సంవత్సరంలో రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకుంటే వారి పెరుగుదలలో వృద్ధి అధికంగా ఉంటుందన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో ఫిబ్రవరి 10, ఆగస్టు 10వ తేదీల్లో 19 ఏళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారన్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 10వ తేదీ రెండో శనివారం ఉండడంతో 9వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు అందజేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, అర్బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించండి

నంద్యాల: ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోని 1–19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ మాత్రలను నమిలి మింగించేలా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల నియంత్రణ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో మొత్తం 4,11,270 పిల్లలు ఉన్నట్లు గుర్తించారని, ఈ నెల 9వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం తరువాత నమిలి మింగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 16వ తేదీ మ్యాప్ అప్ రౌండ్‌లో మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, జిల్లా ప్రోగ్రాం అధికారులు, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ శారద, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్రశేఖర్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి జగదీశ్ చంద్రరెడ్డి, ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ రుపేంద్రనాథ్ రెడ్డి, సునీత, డీఈఓ సుధాకర్ రెడ్డి, ఐసీడీఎస్. ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, అధికారులు

ఖైదీల హక్కులను చట్టం కాపాడుతుంది



ఖైదీలతో మాట్లాడుతున్న అధికారులు

డోన్ టౌన్: స్వతహాగా లాయర్లను నియమించుకోలేని రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి వారి హక్కులను కాపాడటానికి చట్టం కృషి చేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాస రావు, డోన్ సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. సోమవారం వీరు పట్టణంలోని సబ్ జైలుతో పాటు, బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలిస్తూ సమస్యలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఖైదీలతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఏ నేరాలపై రిమాండ్‌కు వచ్చారు? ఎన్ని రోజులైంది? బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నారా? బాల నేరస్తులు ఉన్నారా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో సౌకర్యాలు, భోజన సదుపాయాలు తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది మాధవస్వామి, కోర్టు సిబ్బంది కల్యాణీ తదితరులు ఉన్నారు.

యువత ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: యువత ఉన్నతంగా ఎదగాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమ వారం వర్సిటీలోని సెనేట్ హాల్‌లో ఓవర్సీస్ ఎడ్యుకేషన్, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఉపాధి సృష్టించి తోటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా రు. ముఖ్య వక్తగా హాజరైన కె. రామారావు మాట్లా డుతూ విద్యార్థులు కమ్యునికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రణాళికాబద్ధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయ డీటీగా గౌరీ శంకర్

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించిన గౌరీశంకర్‌ను డిప్యుటేషన్‌పై సోమవారం కర్నూలు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇక్కడ డీటీగా బాధ్యతలు అప్పగించారు. కాగా రెవెన్యూ శాఖలో ఆరునెలలకు పైగా సెలవుల్లో ఉన్న గౌరీశంకర్‌ను సోమవారమే వెల్దుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. వెంటనే అక్కడి నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ కలెక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చిన అర్జీలకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధన్‌రావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఆ సమయంలో సమస్యను ఏ అధికారి అయితే పరిష్కరించే అధికారం కలిగి ఉంటారో గమనించి ఇవ్వాలన్నారు. అప్పుడు సంబంధిత అధికారి బాధ్యత తీసుకొని అర్జీదారుడిని పిలిపించుకొని మాట్లాడితే క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితి తెలుస్తుందన్నారు. అప్పుడే అర్జీదారుడిలో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కాగా అర్జీలను ఎందుకు తిరస్కరిస్తున్నామో రాతపూర్వకంగా అర్జీదారులకు తెలిపితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీపై వచ్చిన పలువురు తహసీల్దార్లు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రమాద బాధితులకు సహాయం మన బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీసీ కె. శ్రీధర్

కర్నూలు(హాస్పిటల్): రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు భద్రతా 35వ మాసోత్సవాలు సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సంఘటన స్థలంలో ఉన్న ఎవ్వరైనా సరే సహాయకుడు బాధ్యతగా అంబులెన్స్‌ను పిలిపించి హాస్పిటల్‌కు తరలించాలన్నారు. రాష్ట్రంలో రహదారి ప్రమాదాల్లో గంటకు ఒకరు చొప్పున చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ రహదారిపైన ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు చాలా కీలకమైనవన్నారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని హాస్పిటల్ సిబ్బంది వేధించకూడదని, బాధితుడిని అడ్మిట్ చేసుకోవాలి గాని సహాయకుని గుర్తింపు గాని, చిరునామా గాని అడగరాదని వైద్యులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు విషయంలో సహాయకారిని ఏ విధమైన ఇబ్బందికర ప్రశ్నలు అడగకూడదన్నారు. వారి సాక్ష్యం కోసం బలవంతం చేయకూడదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు, ఆర్‌టీఓ రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాబు కిశోర్, ట్రాఫిక్ సీఐ గౌతమి, సీనియర్ అసిస్టెంట్లు హాజీస్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.